Andhra prabha Dt- 11/12/17.

# మెట్రో జోష్

సాధారణ రోజుల్లో లక్షకు పైగా

వీకెండ్స్‌లో రెట్టింపు

వేసవిలో మరింత పెరిగే అవకాశం

నగర ప్రజా రవాణాలో పెనుమార్పులకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన హైదరాబాద్ మెట్రో రైలులో ప్రయాణించేందుకు ప్రజలు అమితంగా ఇష్టపడుతున్నారు... దేశంలోని ఇతర కాస్మోపాలిటన్ నగరాలకు భిన్నంగా నిలిచిన హైదరాబాద్ మెట్రోకు ప్రజాదరణ రోజురోజుకూ పెరుగుతోంది... ప్రస్తుతానికి అందుబాటులోకి వచ్చిన 30 కిలోమీటర్ల మార్గానికే ఈ తరహాలో నగర ప్రజలు ప్రయాణిస్తున్నారంటే.. రానున్న రోజుల్లో మూడు కారిడార్లలో పూర్తిస్థాయిలో 72 కిలోమీటర్లు అందుబాటులోకి వస్తే.. అది రోజుకు 5 లక్షలకు పైగా చేరుకునే అవకాశముమన్నట్లు కనిపిస్తోంది... 2018 చివరి నాటికి మూడు కారిడార్లలో 64 కిలోమీటర్ల మార్గం పట్టాలెక్కే అవకాశం ఉండగా.. కారిడార్-2 ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు ఉన్న ఆరు కిలోమీటర్ల మార్గంపై కొంత సందిగ్ధత నెలకొంది... ఇప్పటికే ప్రతిపాదించిన మార్గంలో వేయి ఆస్తులను సేకరించాల్సి రావడంతో పాటు.. పాతబస్తీ ప్రజాప్రతినిధులు ప్రత్యామ్నాయ మార్గంలో నిర్మించాలని సూచిస్తున్నారు... ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి కేసీఆర్ కీలక నిర్ణయం తీసుకోవాల్సి ఉంది... దీంతో పాతబస్తీ వాసుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది...

-కెఎస్ఎన్, హైదరాబాద్

వివరాలు 4లో





మెట్రో రైల్వే స్టేషన్‌లో రద్దీగా ఉన్న జనం



టికెట్ కౌంటర్ల వద్ద బారులుతీరిన జనం

మెట్రో జోష్

హైదరాబాద్, డిసెంబర్ 10 (కెఎస్ఎన్): నగరంలో ప్రస్తుతం అందుబాటులోకి వచ్చిన కారిడార్ 1, 3 మార్గంలో మియాపూర్ టు అమీర్‌పేట, అమీర్‌పేట్ టు నాగోల్ 30 కిలోమీటర్ల మార్గంలో రోజుకు ఒక లక్ష మందికి పైగా ప్రయాణీకులు ప్రయాణిస్తున్నారు. వీకెండ్స్‌లో ఈ సంఖ్య లక్షన్నర నుంచి రెండు లక్షలకు చేరుకుంటోంది. ఈ అంశాలను పరిశీలిస్తున్న హైదరాబాద్ మెట్రో రైలు అధికారులు, నిర్మాణ సంస్థ ఎల్‌అండ్‌టీ ఎంఆర్‌హెచ్ఎల్ ప్రయాణీకుల రద్దీకి అనుగుణంగా ఎప్పటికప్పుడు మార్పులు చేస్తోంది. అంతేకాకుండా రద్దీకి అనుగుణంగా రైళ్ల సంఖ్యను పెంచాలని మంత్రి కేటీఆర్ ఆదేశించిన నేపథ్యంలో సిగ్నలింగ్, ట్రాక్‌పై ప్రస్తుతం నడుస్తున్న రైళ్ల మధ్య ఉన్న సమయం తదితర అంశాలను ఇరు సంస్థల అధికారులు సంయుక్తంగా అధ్యయనం చేస్తున్నట్లు సమాచారం.

**కొద్దిమేరకు ఉపశమనం..**

గడచిన పది రోజుల్లో నగరంలో నాగోల్ నుంచి హబ్సిగూడ, తార్నాక, సికింద్రాబాద్, బేగంపేట, గ్రీన్‌పార్క్ హోటల్ అమీర్‌పేట మార్గంలో వ్యక్తిగత వాహనాల సంఖ్య చాలా వరకు తగ్గినట్లు సమాచారం. దీంతో పాటు మియాపూర్ టు అమీర్‌పేట మధ్య ఉన్న 13 కిలోమీటర్ల మార్గంలో గతంతో పోల్చుకుంటే ఆటోలు, క్యాబ్‌ల వినియోగం చాలావరకు తగ్గిందనే చెప్పాలి. మెట్రో అందుబాటులోకి వచ్చిన తరువాత ఆయా మార్గాల్లో ప్రయాణిస్తున్న క్యాబ్, ఆటో డ్రైవర్లను కెఎస్ఎన్ పలకరించగా.. మెట్రో రైలు అందుబాటులోకి వచ్చిన తరువాత తమ ఉనికి ప్రశ్నార్థకంగా మారిందని సదరు డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత పరిస్థితి ఇలా ఉంటే రానున్న రోజుల్లో పటాన్‌చెరు, శంషాబాద్, హయత్ నగర్ వరకు మెట్రో విస్తరిస్తే, నగర ప్రజలు ఇతర రవాణా మార్గాలను అన్వేషించే అవకాశం ఉండదని రవాణారంగ నిపుణులు వెల్లడిస్తున్నారు.

**కోచ్‌లు పెరిగితే..**

ప్రస్తుతం అందుబాటులోకి వచ్చిన రెండు కారిడార్లలో 30 కిలోమీటర్ల మార్గంలో రైళ్లు ప్రయాణీకుల అవసరాలకు అనుగుణంగా నడుస్తున్న విషయం విధితమే. రద్దీ దృష్ట్యా రానున్న కాలంలో కోచ్‌ల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం నడుస్తున్న ప్రతి రైలుకు కేవలం 3 కోచ్‌లు మాత్రమే ఉండటంతో పాటు, ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే మెట్రో రైళ్లు అందుబాటులో ఉన్నాయి. కొద్ది నెలల తరువాత ప్రతి రైలుకు అదనంగా మరో రెండు కోచ్‌లను పెంచడంతో పాటు, ప్రారంభ, ముగింపు సమయాల్లో మార్పులు జరిగి మరో రెండు గంటలు అదనంగా ప్రయాణించే అవకాశం ఉంది. దీంతో ప్రతి ట్రిప్పుకు మరో 700మంది ప్రయాణీకులు పెరిగితే, అదనంగా ప్రతిరోజూ మరో 50-60వేల మంది ప్రయాణించే అవకాశం ఉండవచ్చని ఓ అంచనా.

**వేసవిలో..**

ప్రస్తుతానికి నగర ప్రజలతో పాటు, కొందరు పర్యాటకులు సైతం మెట్రోలో ప్రయాణించి కొత్త అనుభూతిని పొందుతున్నారు. వేసవి సెలవుల్లో నగరానికి పర్యాటకుల తాకిడితో పాటు, పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రజలు నగరంలో ఎంజాయ్ చేసేందుకు భారీసంఖ్యలో వస్తుంటారు. ఈ నేపథ్యంలో వేసవిలో మెట్రో రైలులో ప్రయాణించేందుకు ప్రజలు క్యూకట్టే అవకాశం ఉంది.